ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు



సాక్షిలో ప్రచురితమైన కథనం



పోలీసులు విడుదల చేసిన ట్రాఫిక్ మళ్లింపు రేఖాచిత్రం

సాక్షి ఎఫెక్ట్..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ రెండో దశ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఆలుగడ్డబావి వంతెన వద్ద ట్రాక్ కనెక్టివిటీ పనులు జరుగుతున్న నేపథ్యంలో వంతెన ఏ– ద్వారం గుండా మాత్రమే ట్రాఫిక్‌ను అనుమతిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఫలితంగా తార్నాక, మెట్టుగూడ మార్గాల నుంచి చిలకలగూడ మార్గాల గుండా చిలకలగూడ కూడలికి వెళ్లే వాహనాలు ముందుకు కదలడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు సమయం వృథా అవుతున్న క్రమంలో ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ నెల 8న సాక్షిలో 'వంతెన పనులు ఓ వైపు.. ట్రాఫిక్ సమస్యలు మరోవైపు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన సీపీ ట్రాఫిక్ మళ్లింపుల ప్రకటన విడుదల చేశారు. తార్నాక, లాలాపేట నుంచి సంగీత్ కూడలి, చిలకలగూడ కూడలికి వెళ్లే ప్రయాణికులు తార్నాక కూడలి మీదుగా సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాలని కోరారు. మల్కాజిగిరి, మీర్జాల్‌గూడ నుంచి సంగీత్‌కూడలి, చిలకలగూడ కూడలికి వెళ్లే ప్రయాణికులు తుకారాంగేట్ ఆర్‌యూబీ, సెయింట్ జాన్స్ కూడలి మీదుగా వెళ్లాలని సూచించారు.

ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ జగన్

లాలాపేట: పెట్రోల్ బంకులే టార్గెట్ చేసుకుని ఫోన్‌పే, గూగుల్ పే మనీ ట్రాన్స్‌ఫర్ పేరుతో దోపిడీలకు పాల్పడుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ ఏసీపీ జగన్ సూచిస్తున్నారు. ఇదే తరహా ఇటీవల ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలోని తార్నాకలో చోటు చేసుకున్న సంఘటన వివరాలను మంగళవారం ఆయన వివరించారు. షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ సబీల్(33) చెడు వ్యసనాలు జూదం, మద్యానికి బానిసై సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలను ఎంచుకున్నాడు. ఈ నెల 5న రాత్రి 8 గంటల ప్రాంతంలో తార్నాకలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు హడావుడిగా వచ్చాడు. తాను అత్యవసర పరిస్థితిలో ఉన్నాను తన వద్ద రూ. 20 వేల నగదు ఉంది అది మీకు ఇస్తాను ఫోన్‌పే నెంబర్‌కు పంపితే మీకు కమీషన్ ఇస్తానని నమ్మబలికాడు. కమీషన్ కోసం ఆశపడ్డ బంక్ ఉద్యోగి సుమిత్ రాయ్(28) ఆ దుండగుడు ఇచ్చిన సెల్ నెంబర్‌పై ఫోన్ పే ద్వారా రూ.20 వేలు పంపాడు. ఇంతలో ఆ నగదు ఇవ్వకుండానే అతడు పారిపోవడంతో సుమీత్ రాయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హబ్సిగూడ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఓయూ పోలీసులు పట్టుకుని పీఎస్‌కు తీసుకెళ్లి విచారించగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా వెంకటేష్‌గౌడ్



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేష్‌గౌడ్

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన సీనియర్ నాయకులు ఎస్. వెంకటేష్‌గౌడ్ బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా ఎంపీ సీట్లను బీజేపీ గెలుస్తుందని, మళ్లీ ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, తార్నాక డివిజన్ అధ్యక్షులు రాము వర్మ, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే విద్యార్థుల భవిష్యత్



వేడుకల్లో పాల్గొన్న సంగని రాజు

పద్మారావునగర్: క్రమశిక్షణతో కూడిన విద్యాభివృద్ధితోనే విద్యార్థుల జీవితాల్లో వెలుగు చూడగలమని కృష్ణవేణి టాలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సంగని రాజు అన్నారు. పద్మారావునగర్ స్వరాజ్య ప్రెస్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన భోలక్‌పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల విద్యా వికాసాన్ని తమ సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తూ ఆ దిశగా ముందుకు సాగుతుందన్నారు. సాధారణ ఫీజులతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు జోనల్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, సీఈఓ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.



సాక్షి ఎఫెక్ట్..

పూడిక.. రోడ్డుపై లేదిక..

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ఓపెన్ నాలా నుంచి తీసిన వ్యర్థాలు నాలా పక్కనే రోడ్డుపై గుట్టలుగా పోసి వదిలేశారు. రోజుల తరబడి వ్యర్థాలను తరలించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తేది. ఈ సమస్యపై 'పూడిక తీశారు..తరలించడం మరిచారు' అనే శీర్షికతో గతనెల 31న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు.



వ్యర్థాలను తొలగించిన తర్వాత ఇలా..

ష్.. నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయ్!

- గాంధీలో సగానికి పైగా పనిచేయని సీసీ కెమెరాలు
- కాలపరిమితి ముగియడంతో స్పష్టత కరువైన వైనం
- పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తులు
- కేసుల ఛేదనకు తంటాలు పడుతున్న పోలీసులు





పనిచేయని మూడు కెమెరాలు



ఓపీ విభాగం ముందు దిష్టి బొమ్మలా..



ప్రాంగణం బయట పనిచేయని కెమెరా

గాంధీఆస్పత్రి : తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో నిఘా కొరవడింది, ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కాలపరిమితి ముగియడంతో అస్పష్టమైన దృశ్యాలు రికార్డ్ అవుతున్నాయి. ఇదే అదనుగా అసాంఘిక శక్తులు, జేబు, చిల్లర దొంగలు పెట్రేగిపోతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, రోగి సహాయకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బందికి చెందిన సెల్‌ఫోన్లు, పర్సులు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాలతో పాటు విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ప్రతిరోజు పది నుంచి పదిహేను మంది బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. చోరీ, దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాల ఫుటేజీల్లో నమోదు అవుతున్నా, స్పష్టత లేకపోవడంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులకు ఇబ్బందిగా మారుతోంది.

ఓపీ విభాగంలో హస్తలాఘవం...

తెలంగాణ జిల్లాలతో పాటు నగరం నలుమూలల నుంచి గాంధీ అవుట్‌పేషెంట్ విభాగానికి ప్రతిరోజు సుమారు మూడు వేల మంది వస్తారు. వైద్య సేవల కోసం వచ్చే, రోగులు, రోగి సహాయకులతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఇదే అదనుగా అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయి. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని గుర్తించి నిలువరించి ఆరా తీస్తే వైద్యం కోసం వచ్చానని చెప్పడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. ఓపీ చిట్టీ కౌంటర్, ఆయా వార్డులు, సెంట్రల్ ల్యాబ్‌ల వద్ద కాపుకాసిన జేబుదొంగలు తమ హస్తలాఘవం ప్రదర్శించి అందిన కాడికి దోచుకుంటున్నారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు తరుచూ మాయం అవుతున్నాయి.

సింహభాగం పనిచేయని కెమెరాలే..

గాంధీఆస్పత్రిలో 213 సీసీ కెమెరాలను 12 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల కాలపరిమితి కేవలం ఐదేళ్లు. తర్వాత లెన్స్‌లు అరిగిపోయి దృశ్యాల్లో స్పష్టత ఉండదని నిపుణులు చెబుతున్నారు. గాంధీలో ఏర్పాటు చేసిన వాటిలో సింహభాగం కెమెరాలు పనిచేయడం లేదు. సెక్యూరిటీ వ్యవస్థ, స్థానిక, స్పెషల్ ఫోర్స్ పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నప్పటికీ చోరీలు, దొంగతనాలు నానాటికీ పెరుగుతున్నాయి. గాంధీలో చాలా వరకు సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, చేస్తున్న వాటిలో దృశ్యాల్లో స్పష్టత లేదని చిలకలగూడ డీఐ రమేష్‌గౌడ్ అన్నారు.

రూ.1.5 కోట్లతో ప్రతిపాదనలు..

గాంధీఆస్పత్రిలో సాంకేతిక నిఘా వ్యవస్థను మరింత మెరుగు పర్చేందుకు, అధునాతన సీసీ కెమెరాల ఏర్పాటు, నూతన కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రూ.1.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఎన్నికల కోడ్ రావడంతో సదరు ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని వివరించారు.

హెచ్‌డీఎస్ నుంచి 30 సీసీ కెమెరాల ఏర్పాటు

హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) నిధుల నుంచి 30 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి హెచ్‌డీఎస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపించాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆధునాతన కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆస్పత్రి మొత్తం అత్యంత ఆధునిక సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.

–ప్రొ. రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. చిలకలగూడ చౌరస్తా ప్రాంతంలోని 10 ప్లాట్‌ఫాం ప్రవేశ ద్వారం వద్ద సుమారు 65–70 వయసుండే గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

లష్కర్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం

అబిడ్స్: ఈ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నుంచి బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నాంపల్లి నియోజకవర్గంలో కూడా అత్యధిక ఓట్లు పోలయ్యే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ లబ్ధిదారులంతా పద్మారావు గౌడ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.



క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి



పాస్టర్ల సమావేశంలో పాల్గొన్న శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో క్రిస్టియన్ మినిస్ట్రీస్ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. మంగళవారం బొల్లారంలో కంటోన్మెంట్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు జూలియస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాస్టర్ల సమావేశంలో శ్రీ గణేష్ హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనతో పాటు మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మనోహార్, జాయింట్ సెక్రటరీ మహేష్, క్రిస్టియన్ మైనారిటీస్ చైర్మన్ సామ్సన్, ఆంథోని జోసేఫ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన ఖదీరవన్, ప్రమోద్ కుమార్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎనిమిదో వార్డుకు చెందిన ఖదీరవన్, మూడో వార్డుకు చెందిన ప్రమోద్ కుమార్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తొలినాళ్లలో కాంగ్రెస్‌లో కొనసాగిన ఈ నేతలు కొంతకాలం క్రితమే బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జైప్రకాశ్, ఆనంద్‌బాబు, సంతోష్, శరత్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

కాచిగూడ: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న 8 లక్షల మంది విద్యార్థుల మెస్ బిల్లు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే చెల్లించి విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేయాలని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సైతం విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు.

నూతన సంవత్సరాది..

ఉగాది

క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడి, సాంప్రదాయ వంటకాలతో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం దేవాలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు.

–సికింద్రాబాద,సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



జెక్‌కాలనీలో పంచాంగ శ్రవణం చేస్తున్న ఆకెళ్ల వెంకట సుబ్రహ్మణ్యశర్మ



మోడల్‌కాలనీలో పంచాంగ శ్రవణం చేస్తున్న కవిరత్న అద్దంకి శ్రీనివాస్



వేడుకల్లో పాల్గొన్న కోట నీలిమ



బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న కాసాని జ్ఞానేశ్వర్



వేడుకల్లో పాల్గొన్న ఈవో మహేందర్ రెడ్డి



గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్

13న లాలాపేటలో కాంగ్రెస్ బూత్‌స్థాయి సమావేశం

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న లాలాపేటలోని నఫీజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ తార్నాక, లాలాపేట బూత్‌స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మాజి ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు హాజరవుతారని బూత్ ఏజెంట్లు, ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు లాలాపేటలో కిషన్‌రెడ్డి బైక్ ర్యాలీ

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం తార్నాక డివిజన్ పరిధిలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి జీప్‌యాత్ర, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తార్నాక డివిజన్ అధ్యక్షులు రాము వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు లాలాపేటలోని మహాత్మ జ్యోతీరావు పూలే విగ్రహం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై శ్రీపురికాలనీ, లాలాపేట వివేకానంద చౌక్, వినోభానగర్ మీదుగా డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు.

ఈటల రోడ్‌షో



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రసూల్‌పురా: బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సోమవారం రాత్రి కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా ఇందిరమ్మనగర్ నుంచి అన్నానగర్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు. పెద్ద రోడ్డు, బీరప్ప టెంపుల్, అర్జున్‌నగర్, బస్తీల గుండా సాగిన రోడ్‌షోకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటేయాలని పిలుపునిచ్చారు. బూటకపు మాటలతో పదేళ్లు కుటుంబ పాలన కొనసాగించిన బీఆర్‌ఎస్, మూణ్ణెళ్ల కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బుడిదలో పన్నీరు పోసినట్లేనని ఎద్దేవా చేశారు. రోడ్ షోలో బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, భానుక నర్మద, బోర్డు మాజీ సభ్యులు లక్ష్మణ్, పార్టీ నాయకులు భానుక మల్లిఖార్జున్, టోపి శంకర్, వివిధ వార్డుల అధ్యక్షులు మాదరపు అశోక్, కనకరాజు, శంకర్ పాల్గొన్నారు.

త్వరలోనే బీజేపీ అభ్యర్థి ప్రకటన



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కంటోన్మెంట్: ఒక ట్రెండు రోజుల్లోనే బీజేపీ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ అన్నారు. బీజేపీ మహంకాళీ జిల్లా అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కంటోన్మెంట్‌లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణతో పదుల సంఖ్యలో అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారని వీరితో పాటు ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న కొందరు కీలక నేతలు సైతం బీజేపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బలమైన అభ్యర్థిని ఎంపిక చేసి, అధిష్ఠానానికి నివేదిస్తామన్నారు. శ్రీగణేశ్‌కు రెండుసార్లు అవకాశమిస్తే, స్వార్థం కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లాడని బీఎన్ శ్రీనివాస్ అన్నారు.

ఇఫ్తార్ విందులో నివేదిత



రసూల్‌పురాలో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్న నివేదిత



నివేదితను ఆశీర్వదిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం రెండవ వార్డు రసూల్‌పురా, మూడవ వార్డు కార్ఖానలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అనంతరం ముస్లిం మతపెద్దలు నివేదితను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు అనిత ప్రభాకర్, మైనార్టీ నాయకులు అఖ్తర్, అహ్మద్, ఫహీం, ఇమ్రాన్, సయిద్, షారుఖ్, రఘురామన్, జిలానీ, నరేష్, శ్యామ్, అంజనేయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న భిక్షపతి రెడ్డి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఏడవ వార్డు తిరుమలగిరి టీచర్స్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాలనీ అధ్యక్షుడు భిక్షపతి రెడ్డి ప్రారంభించారు. ప్రతియేడు శ్రీగణేష్ టీచర్స్ కాలనీతో పాటు కంటోన్మెంట్ వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారుల, వాహనాదారుల దాహార్తిని తీరుస్తాడని భిక్షపతి రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.